www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 31 జులై 2025

5

వైఎస్ఆర్

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత రాక

ప్రజాశక్తి - కడప అర్బన్: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత కడపకు గురువారం రానున్నారు. జిల్లాలో గురు, శుక్రవారాల్లో రెండ్రోజుల పాటు ఆమె పర్యటన చేస్తున్నారు. అనంతపురం నుంచి రోడ్డు మార్గాన గురువారం ఉదయం 11.30 గంటలకు పులివెందులలోని టిడిపి కార్యాలయానికి మంత్రి సవిత చేరుకుంటారు. అక్కడ టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు జమ్మలమడుగుకు చేరుకుంటారు. ఆగస్టు 1న జమ్మల మడుగులో సిఎం చంద్రబాబునాయుడు పర్యటన నిమిత్తం ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సవిత సమీక్షించనున్నారు. అనంతరం జమ్మలమడుగులోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రికి కడపలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ చేరుకుని బస చేస్తారు. మరుసటి రోజు శుక్రవారం జమ్మలమడుగులో జరగబోయే చంద్రబాబునాయుడు కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొనబోతున్నట్లు మంత్రి కార్యాలయంలో బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

అధికారుల అండతోనే భూకబ్జాలు

- నిరసనలో అఖిలపక్ష నాయకులు

ఆందోళన కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో కబ్జాదారుల చేతిలో ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిలపక్షం, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, స్థలాలను ప్రయివేటు వ్యక్తుల కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో రెవెన్యూ, కార్పొరేషన్ యంత్రాంగం విఫలమైందంటూ బుధవారం అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు ఎ.రామమోహన్, ఎన్.ఎ.సత్తార్, ఓబయ్య, మగ్బుల్‌బాషా, రమణయ్య, డబ్ల్యూరామ్, సుబ్బరాయుడు, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కడప నగరంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్నీ ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అధికార యంత్రాంగం సహకరిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకున్న భూ కబ్జాదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో సుమారు 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రయివేట్ వ్యక్తుల పేర్లతో బదలాయింపు జరిగిందని, దీని మీద సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శ్మశానాలు, కాలువలు, వంకలు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. భూకబ్జాదారులకు రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు పెద్ద ఎత్తున సహకారం అందించడం వల్లనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని పేర్కొన్నారు. కడపను భూ కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని, లేనిపక్షంలో దశల వారి ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు దస్తగిరిరెడ్డి, ఐన్ఫేష్, కుమారస్వామిరెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, నరసింహ, గోవింద, రామకృష్ణారెడ్డి, రఘురామ్, జకరయ్య, ఆటోపిఏ నగర కార్యదర్శి మక్బూల్‌బాషా, కార్యదర్శివర్గ సభ్యులు చాపల సుబ్బరాయుడు, మహిళా సంఘం నాయకులు తస్లీమ్, లక్ష్మీదేవి, ఆఫ్ కె ఆజాద్ నగర అధ్యక్షులు ఆబిద్ హుస్సేన్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం నాయకులు రవి, ఓబులేష్, చిన్న సుబ్బయ్య, శంకరయ్య, వెంకటేష్, జార్జి, లక్ష్మీదేవి, జమీల, సునీత పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- జాతీయ ఎస్‌సి, ఎస్‌టి హబ్ అధికారి సురేష్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకొని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జాతీయ ఎస్‌సి, ఎస్‌టి హబ్ అధికారి ఎస్.సురేష్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి హబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి మహిళ పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలనుఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని కోరారు. ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్‌సి, ఎస్‌టి యూనిట్లు అన్ని రీయింబర్స్‌మెంట్ పథకాలలో నమోదు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రుణాలు ప్రయోజనాలను పొందేందుకు పూర్తి మద్దతు ఇవ్వడానికి బ్యాంకులు పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఇంట్రాక్షన్ జరిపి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆంధ్ర, తెలంగాణలలో అన్ని జిల్లాల వ్యాపార సంఘాలు ఎస్‌సి కార్పొరేషన్ బ్యాంకర్లతో, ప్రభుత్వ ఏజెన్సీలతో ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి పలు కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 75 కంటే ఎక్కువ ఎస్‌సి, ఎస్‌టి ఎంఎస్ఎంఇ అవగాహన సదస్సులలో పాల్గొని ఎస్‌సి, ఎస్‌టి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, ఎపిఐఐసి జడ్ఎం ఎం.శ్రీనివాసమూర్తి, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి హబ్ సభ్యులు వసంత్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌సి, ఎస్‌టి హబ్ అధికారి సురేష్

2న ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా : ఫ్యాప్టో

మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాషా

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 2వన ధర్నాను నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ ఇలియాస్ బాషా, రాళ్ళపల్లి అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘ ఇచ్చిన పిలుపు మేరకు విద్యా రంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికై 2వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయడానికి ముందస్తు సమావేశం బుధవారం స్థానిక వివిఆర్, ఎస్‌టియు భవన్‌లో ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో పని చేసే ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్లను పూర్తిగా రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పి4 కార్యక్రమంలో పాల్గొనాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలంటూ కోరారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధ తను తొలగించాలన్నారు. 72, 73, 74 జిఒలను వెంటనే అమలు చేయాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. అంతర్ జిల్లాల బదలీలను వెంటనే చేపట్టాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయ, ఉద్యోగులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎం.విజయకుమార్ (యుటిఎఫ్), ఎన్.సంగమేశ్వర్‌రెడ్డి(ఎస్‌టియు), ఖాదర్‌బాషా(ఎపిటిఎఫ్257), ఎం.వి.సుబ్బారెడ్డి (హెచ్ఎంఎ), రాష్ట్ర జిల్లా నాయకులు సురేష్ బాబు, మహేష్ బాబు, రామచంద్రరెడ్డి, రామమోహన్, శివారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

- వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రమణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న రమణయ్య

ప్రజాశక్తి-అట్లూరు

ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరగదిండ్ల రమణయ్య, బత్తల గంగయ్య అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిధులు కేటాయించడంతో పాటు విధివిధానాలు ప్రకటించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా వడ్డెర్లలకు కూడా సామాజిక రక్షణ చట్టం ప్రభుత్వం వెంటనే తీసుకు రావాలన్నారు. వడ్డెరుల సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. వడ్డెరులకు, వడ్డెర మహిళలకు, పిల్లలకు, వృద్ధులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని తెలిపారు. రెండు ఎకరాలు సాగు భూమి ఇవ్వడం ద్వారా వలసలను అరికట్టాలని పేర్కొన్నారు. వడ్డెర వృత్తిదారులు మట్టిపని, కంకర క్వారీలలో పనులు చేయడంతో 50 సంవత్సరాల కంటే ఎక్కువకాలం పని చేయలేరని, వారికి పింఛన్లు ఇవ్వాలన్నారు. అత్యధిక మంది నిరుపేదలని తెలిపారు. వడ్డెర వృత్తిలోనికి అధునాతనమైన యంత్రాలతో పెత్తనదారులు, బడా కార్పొరేట్ కంపెనీలు వచ్చి వృత్తిని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో నిలదొక్కునడానికి ప్రభుత్వం అధునాతనమైన యంత్ర పరికరాలను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో రుణాలు ఇచ్చి వారి సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో నిత్యం వడ్డెర్లపై దాడులు, వడ్డెర మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరుగుతు న్నాయని వాటిన అరికట్టడానికి సామాజిక రక్షణ చట్టం ఎంతో అవసరమని డిమాండ్ చేశారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యం : 'పుత్తా'

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమవుతుందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాపసాహెబ్‌పేట పంచాయతీలోని చెర్లోపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం ఇంటింటికి తెలుగుదేశం పార్టీ నిర్వహించారు. అంతకుముందు అవుటర్ రింగ్ రోడ్డు నుంచి చెర్లోపల్లె 1.2 కిలోమీటర్ మెయిన్ రహదారికి రూ.45 లక్షలతో నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అప్పులు ఆంధ్రప్రదేశ్‌గా మారి, ఇప్పుడిప్పుడే విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని, సూపర్‌సిక్స్‌లో చెప్పిన విధంగా పెన్షన్లు, గ్యాస్ నగదు బదిలీ, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి టిడిపి ఎల్లప్పుడు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన కమలాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్ నాగేశ్వరావు, ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె సొసైటీ బ్యాంక్ చైర్మన్ మోహన్‌బాబు, ఆరు మండలాల సొసైటీ చైర్మన్లు సురేంద్ర యాదవ్, ఆర్ఎస్.వీరకుమార్‌రెడ్డి, బాలుపల్లి నీటి సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, రవిరెడ్డి, సుబ్బనరసయ్య, భాస్కర్‌రెడ్డి, రాజారావు, శంకర్‌రెడ్డి, జబీబుల్లా పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సంధ్యకు పురస్కారం

ప్రజాశక్తి-కడప అర్బన్: ఆర్తి హోం నిర్వాహకులు పుచ్చలపల్లి సంధ్యకు సిఎన్‌బిసి-18 మీడియా ఛానల్, హెచ్ఎస్‌బిసి బ్యాంక్ వారు సంయుక్తంగా ఫ్యూచర్ ఫిమేల్ ఫార్వర్డ్ పురస్కారం అందజేశారు. బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా అభ్యున్నతికి గణనీయమైన కృషిచేసిన ఆర్తి హోంకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహిళలు ధైర్యం, పట్టుదలతో ఏమైనా సాధించగలరని నిరూపించే శక్తివంతమైన ఉదాహరణ ఆర్తి హోం అని పేర్కొన్నారు. అమ్మాయిని భారంగా భావించే నేటి సమాజంలో సంధ్య శిశువుల హత్య, హింస, సాంప్రదాయం, పితృస్వామ్యానికి ఎదురొడ్డి నిలబడ్డారని చెప్పారు. ఈ బృహత్తర సంకల్పానికి ఆర్తి హోం నాంది పలికిందని పేర్కొన్నారు. అసంఖ్యాక జీవులను రక్షించడమే కాకుండా వారి మనస్తత్వాలను మార్చారని తెలిపారు. ఆడపిల్లలో విద్య, సేవ, గౌరవం సామాజిక, నైతికత విలువలు పెంపొందించి తల్లిదండ్రుల ఆకాంక్షి మేరకు వారి బిడ్డల భవిష్యత్తు అభ్యున్నతికి ఈమె చూపిన మార్గం మహనీయమని పేర్కొన్నారు. సమానత్వం భావన, సానుభూతిత్వ సేవలు భారత దేశమంతటా ఆదర్శంగా నిలిచి బాలిక, మహిళల మార్పుకోరేవారికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన : గ్రామాలలో ప్రస్తుత సీజన్లో వరి సాగు చేసే ప్రతి రైతు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ అధికారి బి.చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని అక్కం పేట, రామచంద్రపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన వరి నారు మడి, వరి నాట్లు పరిశీలించి, ముఖ్యమైన చూచనలు చేశారు. రైతులు వరి నాటే వారం రోజుల ముందు, నారుమడిలో ఎకరం నారు మడికి కిలో ఫిరడాన్3జి గుళికలు వేసుకుంటే, ప్రధాన పొలంలో కాండం తొలుసు పురుగును అరికట్ట వచ్చున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రవి మరియు ఇటుకులపాడు విహెచ్ ఎ.సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.

తొలిరోజు ఐదు నామినేషన్లు

పులివెందులకు మూడు, ఒంటిమిట్టకు రెండు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి: జిల్లాలో జడ్‌పిటిసి ఎన్నికల నామినేషన్లు ఊపం దుకున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఖాళీలను భర్తీ చేయడానికి ఉద్దేశించి నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజైన బుధవారం ఒంటిమిట్ట, పులివెందుల స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంటిమిట్టకు రెండు, పులివెందులకు మూడు చొప్పున దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ తరుపున రెండు, వైసిపి తరపున రెండు, జనసేన తరుపున ఒకటి చొప్పున దాఖలయ్యాయి. వైసిపి తరపున పులివెందులకు రెండు, ఒంటిమిట్టకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంటిమిట్టకు స్థానానికి జనసేన తరుపున సిద్ధవటం మండలం ఉప్పరపల్లికి చెందిన రాటాల రామయ్య, కాంగ్రెస్ పార్టీ తరపున రాజంపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన పూల విజయ భాస్కర్ నామినేషన్లు దాఖలు చేశారు. పులివెందులకు కాంగ్రెస్ తరుపున తొండూరు మండలం కృష్ణంగారిపల్లికి చెందిన తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి తరుపున పులివెందుల మండలం తుమ్మలపల్లికి చెందిన తుమ్మల హేమంత్‌రెడ్డి, తుమ్మల ఉమాదేవి నామినేషన్లు దాఖలు చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-అట్లూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మినరల్ డెవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ బాలమునిరెడ్డి, వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బి.సి.సూరారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వరికుంట్లలో బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారన్నారు. ఓట్లు వేయించుకుని అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, బడుగు బలహీన వర్గాలకు 50 ఏళ్లకు పింఛన్ ఇవ్వడం లేదని, జాబ్ కేలండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లింకుండా యువతను దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్ల నిండి 59 ఏళ్ల వయసు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో డిఎల్‌డిఎ చైర్మన్ ఆర్.మాధవ్‌రెడ్డి, డి.బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి రమణయ్య, అట్లూరు ప్రెసిడెంట్ సుబ్బారాయుడు, డీలర్ కృష్ణారెడ్డి, నాయకులు సింగన ఓబుల్‌రెడ్డి, నరసారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం : వైసిపి

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలకు వైసిపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పిలుపునిచ్చారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు వైసిపి బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ అలీ అక్బర్, రాష్ట్ర బిసి సెల్ సెక్రటరీ బసవరాజు, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా వాలంటరీస్ వింగ్ ఉపాధ్యక్షులు రిజ్వాన్, మైనార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ జమీల్, వైఎస్ఆర్‌టియుసి నగర అధ్యక్షుడు నాగరాజు, నగర కార్యదర్శి మాస్టర్ అహ్మద్, నాయకులు అక్బర్ అలీ, అబ్దుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప

కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, వసతి దీవెన వంటి పథకాల్ని అమలు చేయకపోవడం వల్ల వారి భవిష్యత్ అనిశ్చితిలో పడుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. నిధులు విడుదల చేయని లేనిపక్షంలో రాబోయే రోజుల్లో కలెక్టరేట్ ముట్టడి లాంటి తీవ్ర ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి ముడమాల గురుప్రసాద్, జిల్లా యువజన ఉపాధ్యక్షులు రహమ్మత్తుల ఖాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవిరెడ్డి ఆదిత్య

'ఉక్కు'పై మాట నిలబెట్టుకోవాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప: ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి అన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమకు ఇప్పటికే మూడు సార్లు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడైనా శంకుస్థాపన చేస్తున్న ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి ప్రజలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి ఉద్యోగాలు కల్పించాలన్నారు. శంకుస్థాపన కార్యక్రమం నాటకం కాదు, ఇప్పుడు కచ్చితంగా పరిశ్రమను పూర్తి చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటున్నారని తెలిపారు. ఈ మాటను నిలబెట్టుకోవాలన్నారు.

రసాయన శాస్త్రంలో సుల్తానాకు డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర పరిశోధకులు షేక్.సుల్తానాకు డాక్టరేట్‌ను వైవీయూ ప్రకటించింది. రసాయన శాస్త్ర శాఖ ఆచార్యులు ఎన్.సి.గంగిరెడ్డి పర్యవేక్షణలో డిపైఎటైప్ స్మాల్ ఆర్గానిక్ మాలిక్యుల్స్ ఫర్ ఆప్టోఎలక్ట్రానిక్ అప్లికేషన్ అనే అంశం పైన పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. విసి మార్గదర్శకంలో నియమితులైన నిపుణుల బృందం పరిశోధన గ్రంథాన్ని పరిశీలించి డాక్టరేట్‌కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు డాక్టరేట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సుల్తానా రాసిన 8 పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురించారు. డాక్టరేట్ అందుకున్న సుల్తానాను విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్, రసాయన శాస్త్ర శాఖ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

వైవీయూ అధ్యాపక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కడప అర్బన్: యోగి వేమన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైనట్టు ఎన్నికల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి ప్రకటించారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల అంగీకారం మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. అధ్యక్షులుగా వ ృక్ష శాఖ ఆచార్యులు ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎం.ఎం.వినోదిని, ఉపాధ్యక్షులుగా ఆచార్య ఎల్.మాధవి, డాక్టర్ వి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె.మృత్యుంజయరావు, కోశాధికారిగా డాక్టర్ జయంతి కాశ్యప్ ఎన్నుకోబడ్డారు. పాలక మండల సభ్యులుగా డాక్టర్ ఎ.శ్రీధర్ బాబు, ఆచార్య మెర్సీ విజేత, డా.వి.వి.వెంకట్రాము, డాక్టర్ వరప్రభాకర్, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ గణేష్ నాయక్, డాక్టర్ వి.లాజర్, డాక్టర్ గంజి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రొద్దుటూరులోని వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుల నుంచి సంయుక్త కార్యదర్శి, పాలక మండ సభ్యులు ఉంటారని తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల కాల పరిమితితో పనిచేస్తాయన్నారు.

మసీద్ ట్రస్ట్‌కు రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలో వికాస్ విద్యా సంస్థల అధినేత సుభాన్‌బాషా పుట్టినరోజు వేడుకలు సందర్భంగా మసీద్ ఏ హంజా ట్రస్ట్‌కు ఆయన సోదరుడు సుల్తాన్ బాబా రూ.2 లక్షల నగదును ప్రతినిధులకు అందజేశారు. నగరంలోని ప్రేమాలయ అనాథ శరణానికి రూ.10 వేలు అందజేశారు. అనంతరం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సుల్తాన్ బాబా మాట్లాడుతూ సుభాన్‌బాషా రాజకీయంగా, సామాజికంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటున్నారన్నారు. 35 ఏళ్లుగా పుట్టినరోజున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తరచుగా వృథా ఖర్చు చేస్తారని, అలాకాకుండా ఆయన మసీదు అభివృద్ధికి డబ్బు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆయన మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. పలువురు నాయకులు అతన్ని అభినందించారు. మసీదు ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విరాళాన్ని అందజేస్తున్న సుల్తాన్‌బాబా

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

తలపడుతున్న కడప, అనంతపురం జట్లు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా జరుగుతున్న మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఎసిఎ స్టేడియంలో కడప, అనంతపురం జట్లు తలపడుతున్నాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 53.1 ఓవర్లలో 186 పరుగులకు ఆలౌటైంది. ఐదు వికెట్లు నష్టానికి 128 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.3 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులోని సిరాజుద్దీన్ 51 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 3, కిరణ్ కుమార్ 2, సంజయ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 70 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టానికి 242 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆదినారాయణరెడ్డి 118 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కడప జట్టులోని గైబు మూడు వికెట్లు తీసుకున్నాడు.

మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 325 ఆలౌట్

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 325 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులోని ప్రభాకర్ 130 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కర్నూలు జట్టులోని యుహాస్ 4, వివేక్ 3, సాయి విగ్నేష్ 3 వికెట్లు తీసుకున్నారు. వికెట్ నష్టపోకుండా 44 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 100 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగులు చేసింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 90 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మాలిక్ మూడు, రక్షణ సాయి 2 వికెట్లు తీసుకున్నారు.

ఎమ్మెల్సీకి తోలుబొమ్మను బహూకరిస్తున్న కళాకారుడు

హస్తకళలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రాచీన హస్తకళలను కాపాడుకోవాలని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మ కళాకారుడు కుల్లాయప్ప ఓ బొమ్మను ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తోలుబొమ్మ కళాకారులైన దలవాయి కులాయప్ప, దలవాయి శివమ్మకు హస్తకళల విభాగంలో ఇటీవలనే ఢిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనలో జాతీయ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కళలు అంతరించిపోకుండా కాపాడుకుంటూ శ్రీకృష్ణ చరిత విశ్వరూప హనుమాన్ వంటి కళాఖండాలను రూపొందించి ఆదర్శంగా నిలిచారని కులాయప్పను కొనియాడారు. దలవాయి శివమ్మకు ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డు ఎంపికకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన వారికి అభినందనలు తెలిపారు.

రేషన్ కార్డు ఆధారంగా సంక్షేమ పథకాలివ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇవ్వబోయే అన్ని సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పివిఎస్‌వి ప్రసాదరావు, సూగురు రఘునాథరావు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలకు సాధికారిక సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, దీనివల్ల ఎంతో మంది అర్హత అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. సాధికారిక సర్వే నాటికీ, ఇప్పటికీ కుటుంబ పరిస్థితులు మారిపోయాయని తెలిపారు. ఎన్నో కుటుంబాలు విడిపోయి వేరుగా ఉన్నాయన్నారు. సర్వే నాటికి పిల్లలు ఉండే వారని పెళ్లిళ్ల చేసుకొని వేరు కాపురాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పోవడంతో ప్రస్తుతం వృద్ధులు మిగిలి పోయారని అన్నారు. పెన్షన్‌తోపాటు ఇతర పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా అనర్హులుగా తిప్పి పంపుతున్నారని చెప్పారు. పథకాలు రాకపోవడంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అన్ని వర్గాల్లో ఈ సమస్య ఉందన్నారు. కూటమి ప్రభుత్వ నేతలు ఆలోచించి అర్హుల ఎంపికకు రేషన్ కార్డు ప్రమాణికం చేయాలని వారు కోరారు.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే చేయాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం స్వామిత్వపై ఇఒపిఆర్‌డి, మండల సర్వేర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల సర్వేయర్ జ్యోషి రాజు మాట్లాడుతూ ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్ (పిపిఎం)పై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సచివాలయాల సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేడు బద్వేల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈనెల 31న బద్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాహుల్ పిలుపునిచ్చారు. ఆ మేరకు బుధవారం ఆయన స్థానిక వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశా విద్యార్థులతో కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, మండల సహాయ కార్యదర్శి దేవా కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- అగ్నిమాపక శాఖ రీజినల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ రీజినల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గండి రోడ్డులోని నారాయణ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ కొట్టి నారాయణరెడ్డి సాదరంగా భూపాల్‌రెడ్డిని ఆహ్వానించారు. పాఠశాల ఆవరణాన్ని పరిశీలించి, యాజమాన్యానికి తగు సూచనలు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంట్లో ఉన్న వంట గ్యాస్ లీక్ అయి మంటలు వచ్చే సమయంలో సంచి పట్టాలను వాటిపై వేయాలని సూచించారు. మంటలు ఆర్పే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని కోరారు. అనంతరం రీజనల్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డికి పాఠశాల తరుపున కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఘనంగా సత్కరించి, శ్రీవెంకటేశ్వర స్వామి చిత్ర పటాన్ని అందజేశారు. తమ పాఠశాలకు రావడం సంతోషంగా ఉందని నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న కరస్పాండెంట్ నారాయణరెడ్డి

క్రైం కార్నర్

గేట్ మీద పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి అనుశ్రీ (6) మీద గేట్ పడి మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తొండూరు మండలం ఊడగాండ్ల గ్రామానికి చెందిన బాలగంగాధర్ స్థానిక నల్లబల్లెకు చెందిన గాయత్రిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు అనుశ్రీ. పాప 1వ తరగతి చదువుతుంది. బుధవారం భార్యభర్తలు చిన్నారి అనుశ్రీతో నల్లబల్లెకు వచ్చారు. బుధవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా ఇంటి ప్రహరీకి ఏర్పాటు చేసిన గేట్ మీద పడి తీవ్రంగా గాయపడింది. ముద్దనూరు ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

అనుశ్రీ(ఫైల్‌ఫొటో)

కంటి చూపు మందగించిందని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - లింగాల

కంటి చూపు మందగించిందని మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్రమంగా కంటి చూపు మందగించి, అంధత్వం రావడంతో కుటుంబానికి అండగా ఉండలేకపోతున్నానని భరత్ కుమార్ (23) ఉరేసుకున్న సంఘటన తాతిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. జయరాములు, గంగమ్మ దంపతులకు ఒక కుమార్తె(వివాహిత), కుమారుడు భరత్ కుమార్ సంతానం. ఏడేళ్ల వయసు నుంచి భరత్‌కుమార్ కంటి చూపు లోపం ఉంది. కంటి అద్దాలు వాడుతూ డిగ్రీ వరకు చదివాడు. ప్రయివేట్‌గా లెక్కల మాస్టర్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. ఐదు నెలలుగా కంటి చూపు మందగించడంతో పలు ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. నయం కాక సమస్య తీవ్రమైంది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఊరి వేసుకోని మృతి చెందాడు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

20 మంది రైతుల వైర్లు అపహరణ - లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - వేంపల్లె

పంటలకు నీటి తడులందించేందుకు పొలాల్లోని బోర్లకు అమర్చిన విద్యుత్ సబ్ మెర్సిబుల్ మోటర్ల వైర్లు చోరీకి గురవుతున్నాయి. రైతులు లబోదిబోమంటున్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె, వైఎస్ మదీనాపురం రైతులు నిమ్మ, చీనీ, అరటితోపాటు ఆయా పంటలను సాగు చేశారు. పొలాల్లో బోర్లను వేసుకొని డ్రిప్ సాయంతో నీటి తడులను పంటలకు అందించేందుకు సబ్ మెర్సిబుల్ మోటర్లను బిగించుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రైతులు పంట పొలాల్లో అమర్చుకున్న మోటర్లుకు చెందిన వైర్లను మంగళవారం రాత్రి కత్తిరించి ఎత్తుకెళ్లారు. బుధవారం పంటలకు నీటి తడులందించేందుకు పంట పొలాల వద్దకు వెళ్లి మోటర్లు ఆన్ చేయగా మోటర్లు ఆడకపోవడంతో మోటర్లు వద్దకు వెళ్లి చూడగా వైర్లు కత్తిరించిన విషయం బయట పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రోజు దాదాపు 20 మంది రైతులకు చెందిన పంట పొలాల్లో మోటర్లుకు ఉన్న వైర్లు గుర్రైనట్లు రైతులు పేర్కొంటున్నారు. వైఎస్ మదీనా పురం, చింతలమడుగుపల్లెకు చెందిన చిన్న ఖాసీం, పఠాన్ రషీద్, రమేష్, సయ్యద్ ఖాసీం, షేక్ షరీఫ్, పఠాన్ అబ్దుల్ మాలిక్, సయ్యద్ రఫీతో పాటు మరి కొందరి రైతుల వైర్లు ఎత్తుకెళ్లారని వాపోతున్నారు. ఒకే రోజు పెద్ద మొత్తంలో వైర్లు చోరీకి గురికావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చోరికి పాల్పడ్డంతో రైతులు ఆందోళనకు గురవు తున్నారు. మీటర్ వైరు రూ.120 పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. దీనికితోడు బోర్లులో నుండి మోటర్లును పైకి తీయాల్సిన వస్తుందని పేర్కొంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కరెంటు వైర్లుతోపాటు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు పగులగొట్టడం, పైపులను కూడా అపహరిస్తున్నట్లు రైతులు చెప్పారు. సునాయాసంగా డబ్బు సంపాదన కోసం వ్యవసాయ బోరు మోటర్లు ఎత్తుకెళ్లి అందులోని కాపర్ వైరును అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్ప డుతున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో ప్రతి ఏడాది రైతు నష్టాలనే చవి చూస్తునానరు. ఈ నేపథ్యంలో మళ్లీ ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావులకు అమర్చిన విద్యుత్ స్టార్టర్ పెట్టె, వైర్లు, పైపులు చోరీకి గుర వడంతో రైతులు సాగుచేసిన పంటలకు నీరు సర ఫరా చేసేందుకు అప్పులు చేసి కొత్తవి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ఓ వైపు పంటలు పండక రైతులు నష్టపోతుంటే.. మరో వైపు దొంగల పోటు ఎక్కువైందని రైతులు అల్లాడిపోతున్నారు. దొంగలను పట్టుకోవాలని రైతులు పోలీసులను కోరుతున్నారు.

వైర్లు కత్తిరించిన సబ్ మెర్సిబుల్ మోటర్లు

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు తూర్పు వైపున ముద్దనూరు రోడ్డు నుంచి ప్రొద్దుటూరు రోడ్డుకు అనుసంధానంగా ప్రజలు అవతల నుంచి ఇవతలికి వచ్చేందుకు రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి సహకారంతో కృషి చేశానని, త్వరలో బ్రిడ్జి ప్రారంభం కానుందని వైసిపి నాయకులు మాడిశెట్టి శివ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజల సౌకర్యం కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరగా.. ఆయన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎంపీ రైల్వే ఉన్నత అధికారులకు రాతపూర్వక దరఖాస్తు చేశారన్నారు. సెప్టెంబర్ 2023లో ఎంపీ అవినాష్‌రెడ్డి లెటర్‌ను తన ద్వారా దక్షిణ మధ్య రైల్వే జీఎంకు పంపామన్నారు. ఇలా రైల్వే అధికారులపై వత్తిడి పెడుతూ ఎంపీ ద్వారా, పలుమార్లు దరఖాస్తులు చేయడం ద్వారా చివరకు రైల్వేశాఖ స్పందించిందన్నారు. ఫిబ్రవరి 2024న దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేస్తున్నట్లు ఎంపీకి లెటర్ ద్వారా తెలిపారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి టెండర్లు పిలిచామని వారు ఎంపీ దృష్టికి తెచ్చారు. అనంతరం కాంట్రాక్టు దక్కించుకున్న పవిత్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మాణ పనులు గత డిసెంబర్‌లో మొదలు పెట్టారన్నారు. సెప్టెంబర్‌లో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని శివ తెలిపారు. బ్రిడ్జివల్ల అవతలివైపు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయం, రాణి వనం, ప్రకాష్ నగర్, పేర్ల శివారెడ్డి వీధులలో ఉన్న ప్రజల రాకపోకులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. బ్రిడ్జి రావడానికి కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మాడిశెట్టి శివ ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని సూచించారు. కొత్తవారికి పింఛన్లు మంజూరు చేయడం లేదని, ఉన్న వారిని కూడా చాలామందిని తొలగించడం అన్యాయమన్నారు. ఎన్నికలలో సూపర్‌సిక్స్ పథకాలు పేరు చెప్పి అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. అన్యాయంగా వైసిపి నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని శివ పేర్కొన్నారు.

వైసిపి నాయకులు మాడిశెట్టి శివ

త్వరలో ప్రారంభంకానున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి

'పట్టు' రైతులకు చేయూతనందించాం : ఎడి

ప్రజాశక్తి - కడప సిటీ

పట్టు పరిశ్రమ విస్తరణకు ఇతోధికంగా కృషి చేశానని జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయనను కలువగా.. తన మనోగతాన్ని ఆవిష్కరించారు. తన 34 ఏళ్ల ఉద్యోగ జీవి తంలో మల్బరీ సాగులో వచ్చిన ఆధునిక సాంకేతిక పద్ధతులను, ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందించే ప్రయత్నం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం గొట్లూరు గ్రామంలో అన్నపురెడ్డి నడిపి సుబ్బారెడ్డి, చిన్నమ్మ దంపతుల మూడో సంతా నంగా జన్మించానన్నారు. ఎమ్మెస్సీ మధ్యప్రదేశ్ రాజధాని ప్రాంతమైన భోపాల్‌లో చదివానని తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో బెర్హాన్ పూర్‌లో పిజిడిఎస్ పూర్తి చేశానన్నారు. 1987లో ఉపాధి కల్పనా కార్యాలయం ద్వారా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నానన్నారు. 1991లో చిత్తూరు జిల్లా పలమనేరు అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీ సర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించానని తెలిపారు. 1992లో బదిలీపై కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కలిశెంట్లలో బదిలీపై వెళ్లానన్నారు. 1995 బదిలీపై కర్నూలు జిల్లా ఆదోనిలో సీడ్ మార్కెట్‌లో విధులు నిర్వహించానన్నారు. 2003లో అనంతపురం జిల్లా పెనుగొండలో విదులు నిర్వహించానన్నారు. 2005లో బదిలీపై ఆదోని వెళ్లానని చెప్పారు. 2006లో కర్నూలు జిల్లా ఆత్మకూర్‌లో విధులు నిర్వహించానన్నారు. 2011లో ఉద్యోగన్నతిపై సెరీ కల్చర్ ఆఫీసర్‌గా సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఏడాది పాటు పని చేశానని తెలిపారు. 2012 నుంచి 2014 వరకు పెనుగొండలో పని చేశానన్నారు. 2015 నుంచి 2018 వరకు సీడ్ ఇన్‌ఛార్జి ఎడిగా పని చేశానని తెలిపారు. 2018లో బదిలీపై మదనపల్లి సీడ్ ఇన్‌ఛార్జి ఎడిగా విదులు నిర్వహిం చానన్నారు. 2022లో బదిలీపై కడపకు బదిలీపై వచ్చానని తెలిపారు. 2023లో ప్రమోషన్ పొంది అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిం చానన్నారు. సెరీకల్చర్ డిపార్టుమెంట్‌లో సీడ్ విభాగంలో పని చేయడం సవాలుతో కూడుకున్న విషయమని చెప్పారు. గుడ్లను కమర్షియల్‌పై విక్రయించానని తెలిపారు. రైతులు అడిగిన సమయంలో గుడ్లను పంపిణీ చేశామని చెప్పారు. మడకశిరలో పని చేసే సమయంలో అధికారుల ప్రోత్సా హకాలు అందించడం ప్రారంభించామని తెలిపారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ యూనిట్‌కు రూ.60 వేలులో 80 శాతం సబ్సిడీ అందించడం జరిగిం దన్నారు. మల్బరీ సాగు రైతులకు విత్తన గుడ్లను ఇచ్చి తిరిగి రైతుల నుంచి విత్తన గూళ్లను తీసుకుని, కమర్షియల్ గూళ్లను అందించామన్నారు. హిందూ పురం, పెనుగొండ, ధర్మవరం, కదిరి, మడకశిర సెంటర్లలో సరఫరా చేశా మని తెలిపారు. తాను సర్వీసుల్లో పలుమార్లు ప్రశంసాపత్రాలను కలెక్టర్లు, మంత్రుల చేతుల మీదుగా అందుకున్నానని తెలిపారు. కలెక్టర్లు, ఇతర సహచర అధికారుల సహకారాన్ని మరవలేనిదని ఆయన కొనియాడారు.

పట్టు పరిశ్రమలశాఖ ఎడి ఎ.శ్రీనివాసరెడ్డి

పోలీసుల అదుపులో ఉన్న మోటర్ బైకులు ఇప్పించండి

- మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవిని కోరిన ముస్లిం నేతలు

వేంపల్లె : పోలీసుస్టేషన్‌పై దాడి సంఘటనకు సంబంధించి పోలీసులు అదుపులోకి తీసుకున్న మోటర్ బైకులను, సెల్‌ఫోన్‌లను వారినుంచి ఇప్పించాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డిని ముస్లిం నేతలు కోరారు. బుధవారం పులివెందులలో ఉన్న ఆయనను టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో వేంపల్లెకు చెందిన ముస్లింలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన బీటెక్ రవి తప్పు చేయని ముస్లిం యవతకు చెందిన మోటర్ బైకులు, సెల్‌ఫోన్‌లు పోలీసుల నుంచి ఇప్పించేందుకు కృషి చేస్తానని హమీ ఇచ్చారు. కార్యక్రమంలో పూల అల్లాబక్షు, యాసిన్, అబ్దుల్ రెహమాన్, లాడెన్, ఫయాజ్, గౌస్‌పీర్, గౌస్, షబ్బీర్ పాల్గొన్నారు.

జీవనజ్యోతి బీమా యోజనపై అవగాహన

వేముల : స్థానిక స్త్రీశక్తి భవన్‌లో డ్వాక్రా మహిళలకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన బీమా పథకాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు ఆధ్వ ర్యం లో నిర్వహిం చారు. మండల స మాఖ్య కార్య దర్శిగా ఉంటూ అకాల మరణం చెందిన కుమారి నామిని వెంకటశెట్టికి క్లెయిమ్ రూ.2లక్షలు మేనేజర్ నాగిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షులు శ్రీలక్ష్మి అంద జేశారు. కార్యక్రమంలో గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, మండల సమాఖ్య అకౌంటెంట్ పాల్గొన్నారు.

రైతుల మన్ననలు పొందాలి

పులివెందుల రూరల్ : రైతులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి మన్ననలు పొందాలని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) సూచించారు. స్థానిక పార్లపల్లి రోడ్డు అంకా లమ్మతల్లి దేవస్థానం సమీపంలో నూతనంగా సారెడ్డి గంగాధర్ రెడ్డి ఏర్పాటు చేసిన శ్రీసమరసింహరెడ్డి ఫర్టిలైజర్స్ షాప్‌ను బుధవారం బీటెక్ రవి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మా రెడ్డి జోగిరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, నల్లగారి భాస్కర్‌రెడ్డి, శివ మోహన్‌రెడ్డి, సిద్ధారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE PRODDATUR

E.P.No. 1/2024

O.S.No. 79/2016

Basireddy Sudhakar Reddy, aged about 57 years, son of B.Ramalinga Reddy, Hindu, Correspondent in Sarada High School, residing at D.No. 16/327-3, Nadimpalli street, Proddatur Town, Kadapa District. **...Petitioner(D.Hr.)**

Vs

Singam Gangadhara Reddy, aged about 45 years, son of S.Gangi Reddy, Hindu, Business, residing at D.No.3/532, YMR Colony, Proddatur Town, Kadapa District. **...Respondent(J.Dr)**

RESPONDENT/J.Dr.కి U/o 21 RULE 64 NOTICE

ఈ నెంబరు E.P.లోని రెస్పాండెంట్/ జెడిఆర్ పైన పిటిషనరు/ డిహెచ్‌ఆర్ తరపున రాజశ్రీకోర్టు నందు జెడిఆర్ తాలూకు చెందిన ఆస్తులను వేలమునకు కోరి E.P.ని దాఖలు చేసి ఉన్నాము. అట్టి E.P. నందు రెస్పాండెంట్/జెడిఆర్ అయిన నీకు 9/9/2025 నాడు వాయిదా ఉంటు ఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరు అయ్యి ఏవైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.

వాయిదా తేది: 9/9/2025

//By Order of the Court//

పి. చంద్రశేఖర్

పిటిషనరు/ డిహెచ్‌ఆర్ పరం

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 2187/23

O.S.No. 349/22

కసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, S/o చిన్న సుబ్బారెడ్డి, వయస్సు 46 సం॥లు, డోర్ నెం.3/865, మారుతీనగర్, అరవింద ఆశ్రమం, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు, కడప జిల్లా. **...పిటిషనరు/వాది**

Vs

R4. గౌరు శ్రవణ్ కుమార్ రెడ్డి, S/o Late లేట్ గౌరు శివరామిరెడ్డి, హిందు,

R5. గౌరు సుహాసిని, W/o విజయకుమార్, D/o లేట్ గౌరు శివరామిరెడ్డి, హిందు,

All are residing at D.No.1/156-A, చిన్న శెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం కడప జిల్లా.

...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు R4 and R5

నోటీసు

పై నెంబరు I.A. యందు గౌరు వర్ణిక మైనరు అయినందున లీగల్ రిప్రజెంటీవ్ అయిన గౌరు స్వాతి గారిని గార్డియన్‌గా నియమించమని పిటిషన్ దాఖలు చేసియున్నాము. అట్టి పై I.A. నందు R4 మరియు R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 4.8.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 04.08.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

B.V.RAMANA REDDY

Advocate,

PRODDATUR.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 2188/23

I.A.No. 534/22

O.S.No. 349/22

కసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, S/o చిన్న సుబ్బారెడ్డి, వయస్సు 46 సం॥లు, డోర్ నెం.3/865, మారుతీనగర్, అరవింద ఆశ్రమం, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు,కడప జిల్లా. **...పిటిషనరు/వాది**

Vs

R4. గౌరు శ్రవణ్ కుమార్ రెడ్డి, S/o Late లేట్ గౌరు శివరామిరెడ్డి, హిందు,

R5. గౌరు సుహాసిని, W/o విజయకుమార్, D/o లేట్ గౌరు శివరామిరెడ్డి, హిందు,

All are residing at D.No.1/156-A, చిన్న శెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం కడప జిల్లా.

...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు R4 and R5

నోటీసు

పై నెంబరు I.A. యందు 1వ రెస్పాండెంటు అయిన గౌరు శివరామిరెడ్డి గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను చేర్చుటకు గాను పై I.A. ని దాఖలు చేసియున్నాము. అట్టి I.A. యందు R4 మరియు R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 4.8.2025వ తేదీన ఉదయం 10.30ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 04.08.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

B.V.RAMANA REDDY

Advocate, PRODDATUR.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

మహేశ్వర్‌రెడ్డి కుటుంబానికి సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అన్ని పార్టీలు, ప్రతి ఒక్కరూ మానవీయ కోణంలో ఆలోచించి జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో మహేశ్‌రెడ్డి కుటుంబానికి సహకరించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట మండలం జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందనానరు. గతంలో వైసిపి తరపున జడ్‌పిటిసిగా గెలిచిన మహేశ్వర్‌రెడ్డి ఆకస్మిక మృతితో ఉప ఎన్నిక అనివార్యమైందన్నారు. ఆ స్థానానికి మహేశ్వర్‌రెడ్డి సతీమణి తుమ్మల ఉమాదేవి, ఆయన కుమారుడు తుమ్మల హేమంత్‌రెడ్డి ఇద్దరిలో ఒకరికి సీటు కేటాయించనున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వారి కుటుంబ సభ్యులకు సీటు కేటాయించండం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందులో భాగంగా మండల నాయకులతో చర్చించి మహేశ్వరరెడ్డి కుటుంబానికే సీటు ఇవ్వాలని ఏక వాక్య తీర్మానం చేశామన్నారు. ఇందుకు అన్ని పార్టీలు సహకరించాలని ఎంపీ కోరారు. సహకరించిన వైసిపి మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపల్ అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొంతకాలంగా పట్టణంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, ఆయిల్ మిల్ ఖాజాతోపాటు కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, ఇర్ఫాన్‌బాషా, వెంకట సుబ్బారెడ్డి, జిలాన్, రాచమల్లు రమాదేవి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై గట్టిగా నిలదీశారు. కౌన్సిలర్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ టూ టౌన్ బైపాస్ వద్ద పారిశుద్ధ్య సమస్యపై మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర అని చెప్పుకోవడంతోనే సరిపోతుందని, పట్టణంలో పందులు, దోమలు విపరీతంగా ఉన్నాయన్నారు. కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా, గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదన్నారు. నిత్యవసర సరుకులు అందించే వాహనాలు తీసివేయడం వల్ల మహిళలు తీవ్రంగా విమర్శిస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినా ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ జిలాన్ బాషా మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్లు మారిపోతున్నారు గాని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వైస్ చైర్మన్ ఖాజా మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాలు పేరుకే జరుగుతున్నట్లు అనిపిస్తోందన్నారు. కౌన్సిలర్లు నాగేంద్ర, సత్యం మాట్లాడుతూ అధికారులు వార్డులలో తిరిగే సమయంలో సంబంధిత కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వడం లేదన్నారు. వీధిలైట్లు వెలగడం లేదన్నారు. సమాధానంగా కమిషనర్ రవిచంద్ర మాట్లాడుతూ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రెండు, మూడు రోజులకోమారు వార్డులో పర్యటిస్తున్నానన్నారు. 250 మంది కార్మికులు ఇటీవల సమ్మెలో ఉన్నందున పారిశుధ్యం సమస్యగా ఉండేదన్నారు. ప్రస్తుతం సీఎం జమ్మలమడుగు సభకు 50 మంది కార్మికులు వెళ్లారని తెలిపారు. ఏది ఏమైనా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫాగింగ్ యంత్రాన్ని వినియోగించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా మాట్లాడుతూ పారిశుధ్య సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి - చక్రాయపేట

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని చక్రాయపేటను కరువు మండలంగా ప్రకటించాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభ భవనంలో బుధవారం ఎంపిపి మాధవి బాలకృష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరూ లేచి నిలబడి మండలంలో వర్షాలు లేని కారణంగా తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. బోర్లు, బావులు, ఎండిపోతున్నాయన్నారు. చెరువుల్లో చుక్కనీరు లేక ట్యాంకర్లతో పండ్లతోటలను రైతులు కాపాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన మేరకు యూరియాను సరఫరా చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. వందలాది మంది రైతులు మామిడి పంటకు ఇన్సూరెన్స్ చేశారని, బీమా ఇంతవరకు రాలేదని జడ్‌పిటిసి సభ్యుడు శివ ప్రసాద్ రెడ్డి సమావేశం దృష్టికి తెచ్చారు. పాడా నిధులు కింద పైపులు కోసం రైతులు డబ్బు చెల్లించినా ఇంతవరకు వాటిని ఇవ్వలేదని తెలిపారు. రైతులకు వెంటనే పైపులు అందించి న్యాయం చేయాలని పులి వెందుల వ్యవసాయ శాఖ ఎడిఎ ప్రభాకర్ రెడ్డిని కోరారు. సమావేశానికి పలు వురు అధికారులు గైర్హాజరు కాగా, మరికొందరు తమ కార్యాలయంలో పని చేస్తున్న చిరు ఉద్యోగులను పంపించారు. దీనిపై సభ్యులతోపాటు ఎంపిడిఒ కులాయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహశీల్దార్ విజయకుమారి, మండల ఉపాధ్యక్షుడు గఫూర్, ఎంపీటీసీలు లీలావతి, మోహన్ రెడ్డి, శాంతమ్మ, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు గౌస్ లాజం, ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి, ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మాధవి బాలకృష్ణ

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No. 2189/23

O.S.No. 349/22

కసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, S/o చిన్న సుబ్బారెడ్డి, వయస్సు 46 సం॥లు, డోర్ నెం.3/865, మారుతీనగర్, అరవింద ఆశ్రమం, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు,కడప జిల్లా. **...పిటిషనరు/వాది**

Vs

R4. గౌరు శ్రవణ్ కుమార్ రెడ్డి, S/o Late లేట్ గౌరు శివరామిరెడ్డి, హిందు,

R5. గౌరు సుహాసిని, W/o విజయకుమార్, D/o లేట్ గౌరు శివరామిరెడ్డి, హిందు,

All are residing at D.No.1/156-A, చిన్న శెట్టిపల్లె గ్రామం, రాజుపాళెం మండలం కడప జిల్లా.

...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు R4 and R5

నోటీసు

పై నెంబరు దావా యందు 1వ ప్రతివాది అయిన గౌరు శివరామిరెడ్డి గతించినందున వారి వారసులు అయిన మిమ్ములను చేర్చుటకు గాను పై I.A. ని దాఖలు చేసి యున్నాము. అట్టి I.A. యందు R4 మరియు R5 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 4.8.2025వ తేదీన ఉదయం 10.30ని॥లకు హాజరు అయ్యి ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 04.08.2025

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

B.V.RAMANA REDDY

Advocate,

PRODDATUR.